ప్రజాశక్తి

సోమవారం 24 నవంబర్ 2025 5 శ్రీ సత్యసాయి

సత్యసాయి మార్గం ప్రపంచవ్యాప్తం

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

సత్యసాయిబాబా సూచించిన సేవామార్గాం ఒక్క దేశానికే పరిమితం కాలేదని.. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి తెలియజేశారు. సమానత్వం, సేవ, ఆధ్యాత్మికత ఇవన్నీ సత్యసాయి ట్రస్ట్ మూల ధ్యేయాలని చెప్పారు. పుట్టపర్తిలో గ్రామస్తుల కోసం చిన్న జనరల్ హాస్పిటల్‌గా ప్రారంభమైన వైద్యసేవలు ప్రస్తుతం ప్రపంచ స్థాయి ఉచిత కార్డియాక్, సూపర్ స్పెషాలిటీ వైద్యసంస్థలుగా ఎదగడం బాబా దివ్యకార్యానికి సాక్ష్యమన్నారు. సాయి పాఠశాలలు అందిస్తున్న విలువలతో కూడిన ఉచిత విద్య, తెలివితేటలతో పాటు వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో గొప్ప పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సత్య సాయి బాబా నేతత్వంలో అభివృద్ధి చెందిన గ్లోబల్ సేవా ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని సేవా భావంతో ఐక్యం చేసిందని తెలియజేశారు. బాబా శతాబ్ది ఉత్సవాలు ఒక జ్ఞాపకం మాత్రమే కాక, భవిష్యత్తు తరాలకు సేవా మార్గంకు నాందిగా నిలవాలని ఆకాంక్షించారు.

సేవతో సమస్యకు పరిష్కారం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



కష్టంలో ఉన్న వారికి తమవంతు సాయం అందించి సేవ చేయడం ద్వారా వారి సమస్యకు పరిష్కారం చూపిన వారం అవుతాయని చెప్పిన మహనీయుడు సత్యసాయిబాబా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలియజేశారు. ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తిమార్గంతో కోట్ల మంది జీవితాలను బాబా ప్రభావితం చేశారన్నారు. చిత్రావతి నది ఒడ్డున పుట్టపర్తిని ఆధ్యాత్మికత, దైవత్యానికి నిలయంగా మార్చారన్నారు. 'లవ్ ఆల్, సర్వ్ ఆల్వ్.. హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్' అని సత్యసాయి బోధనలు ప్రజలందరూ ఆచరించాల్సిన సూత్రాలు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా సిద్ధాంతాలతో బాబా నూతన అధ్యాయం ప్రారంభించారని కొనియాడారు. 1960లో బాబా స్థాపించిన సత్యసాయి సంస్థలు తమ సేవలతో శ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంక్షేమాన్ని కోరుకుంటోందన్నారు. ఆయన లేకపోయినా ఆయన నింపిన స్ఫూర్తి ఉందని, ప్రశాంతి నిలయం ఒక ఎనర్జీ సెంటర్ అన్నారు. విద్య, వైద్యం, ప్రజలకు మౌలిక వసతులు ఇలా అన్నింటిలోనూ సత్యసాయి ట్రస్టు భాగస్వామ్యం అవుతోందన్నారు. సత్యసాయి బోధనల ద్వారా వసుదైక కుటుంబం అన్న వదాన్ని నిలబెట్టుకుందామని ముఖ్యమంత్రి తెలియజేశారు.

ప్రభుత్వాలు చేయలేని చోటా బాబా సేవలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కొన్ని ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వాలు చేయలేని చోట కూడా సత్యసాయి ట్రస్ట్ ప్రజలకు సేవలు అందించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలియజేశారు. సత్యసాయిబాబా ప్రజల్లోనే దేవుడిని చూసారన్నారు. ప్రేమతో వారిని గెలుచుకున్నారని తెలిపారు. ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందనే బాబా సందేశం యుగయుగాల పాటు ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. బాబా భౌతికంగా లేకపోయినా ఆయన ఆలోచనలు, సేవాస్ఫూర్తి శత జయంతి ఉత్సవాల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాలు అందించలేని చోట కూడా బాబా ట్రస్ట్ చేపట్టిన సేవలు లక్షలాది మందికి జీవనాధారం అయ్యాయని గుర్తుచేశారు. విద్య, వైద్యం, తాగునీరు రంగాల్లో బాబా చేసిన సేవలు తరతరాలు గుర్తుంటాయన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే బాబా సిద్ధాంతం కేవలం బోధనే కాదు, నమ్మకంగా, అమల్లోనూ నిలిచిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సాయిబాబా శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి తెలియజేశారు.

కమనీయం.. శతజయంతి వైభవం

శ్రీ సత్యసాయి బాబా శత జయంతోత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి. గత వారం రోజులుగా జరుగుతున్న వేడుకలు బాబా జయంతి రోజున ఆదివారం ఆద్యంతం కమనీయంగా కొనసాగింది. పుట్టపర్తి పట్టణం హిల్ వ్యూ స్టేడియంలో అద్భుత ఏర్పాట్లతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సాయి నామ సంకీర్తనలు, అన్ని రాష్ట్రాల సాయిభక్త బంద ప్రదర్శనల చేపట్టిన మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకుంది. ప్రముఖ గాయకులు మనో, శివమణి సంగీత విభావరితో అలరించారు. మనో సంగీత సాహిత్యానికి అనుగుణంగా సత్యసాయి స్వర్ణ రథం ముందుకు సాగింది. బాబా స్వర్ణ రథాన్ని చూసేందుకు బాబా భక్తులు పుట్టపర్తి వీధుల్లో పెద్ద సంఖ్యలో బారులుదీరారు. స్వర్ణ రథం సాగుతున్న సేపూ పుట్టపర్తి వీధులు బాబా నామసంకీర్తనతో మారుమోగాయి.

శతజయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పుట్టపర్తిలో స్వర్ణ రథంలో సత్యసాయి బాబా చిత్ర పటం ఊరేగింపు

సత్యసాయి బాబా స్వర్ణరథం ముందు రత్నాకర్, తదితరులు

సత్యసాయి జయంతి వేడుకలను వీక్షిస్తున్న భక్తులు

- కన్నుల పండుగలా బాబా శతజయంతి వేడుకలు
- సాయినామ స్మరణతో మారుమోగిన హిల్‌వ్యూ స్టేడియం
- ప్రపంచ పర్యాటకులతో పులకించిన పుట్టపర్తి
- హాజరైన ఉపరాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్, ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
పుట్టపర్తి రూరల్

సత్యసాయిబాబా జన్మించి వంద సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో గత వారం రోజులుగా పుట్టపర్తి శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం నాడు బాబా పుట్టినరోజు కావడంతో ప్రముఖులతోపాటు, జనం పెద్దఎత్తున పుట్టపర్తికి తరలొచ్చారు. జనం సందోహంకు తోడు నిర్వహించిన కార్యక్రమాలు అంబరాన్నంటాయి. వివిధ రూపాల్లో నిర్వహించిన నృత్య ప్రదర్శనలతోపాటు, గేయాలపనలు ఆకట్టుకున్నాయి. సత్యసాయిబాబా బంగారు రథంపై ఊరేగింపుతోపాటు స్టేడియంలో భక్తుల మార్చ్‌ఫాస్టు ఆకట్టుకున్నాయి. మిళమిళ మెరిసే విద్యుత్ దీపాలంకరణల్లో సాయిబాబా చిత్రపటాన్ని ఊయలలో ఊపుతూ చేపట్టిన ప్రదర్శనతో భక్తులు పరవశించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భారత ఉప రాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎ.రేవంత్‌రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్ తమిళనాడు మంత్రి శేఖరబాబు, శ్రీ సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ఆల్ ఇండియా అధ్యక్షులు నిమిష్ పాండ్యాతో పాటు దేశ విదేశాలకు చెందిన బాబా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవల ప్రతిరూపం సత్యసాయిబాబా

ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్

శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవల ప్రతిరూప సత్యసాయిబాబా అని ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ తెలియజేశారు. అందరినీ ప్రేమించండి.. అందరికీ సాయం చేయండి అంటూ ఆయన చేసిన బోధనలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ దేశవ్యాప్తంగా అందిస్తున్న మహత్తర సేవలు మరువలేనివన్నారు. ఉచిత విద్య అందిస్తున్న సత్యసాయి విశ్వవిద్యాలయం, గ్రామీణ ఆరోగ్య సేవలు, ఉచిత గుండె శస్త్రచికిత్సలు, తాగునీటి ప్రాజెక్టులు, విపత్తు సహాయ కార్యక్రమాలు లక్షలాది మందికి జీవనాధారం అవుతున్నాయని పేర్కొన్నారు. సేవ, ప్రేమ, శాంతి తదితర బాబా సూక్తులను మాటల్లో కాకుండా వారసత్వంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు.

శతజయంతి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ, ఆంధ్ర ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, త్రిపర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మంత్రి నారాలోకేష్

సైన్స్ ఒక జీవన విధానం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పాఠశాల స్థాయి లో నేర్చుకున్న సైన్స్‌ను జీవితానికి అన్వయించుకోవాలని సైన్సు ఒక సబ్జెక్టు మాత్రమే కాదని అది ఒక జీవన విధానమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గ్లోబల్ జెన్ సీబీఎస్ఈ స్కూల్ లో జెవివి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్సు సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ సైన్స్ అనేది జీవితంలో భాగంగా ఉండాలన్నారు. చదువుకున్న చదువు ఆలోచనగా శక్తిని, ప్రశ్నించే లక్షణాన్ని పెంపొందించాలన్నారు.ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకున్నప్పుడే ఈ దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్థాయికి సైన్స్ అభివృద్ధి చెందినా చదువుకున్న మేధావులే మూఢనమ్మకాల వల్ల మోసగాళ్ల బారిన పడి నష్టపోతున్నారన్నారు. అందుకే ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి వుండాలన్నారు. పిల్లలకు నేర్చుకోవడం ఎలాగో నేర్పించాలన్నారు. నేర్చుకోవడం వేరు చదువుకోవడం వేరు అని అన్నారు. ఈ దేశంలో పుట్టి ఈ దేశంలో పెరిగి ఇక్కడే ప్రయోగాలు చేసిన ఏ శాస్త్రవేత్తకు కూడా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నోబుల్ బహుమతి రాలేదంటే శాస్త్ర పరిశోధనలకు ప్రభుత్వాలు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో తెలుస్తోందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి అంతా సైన్స్ ఫలితమేనన్నారు. ప్రభుత్వ రంగంలో పారిశ్రామిక అభివృద్ధి జరిగినప్పుడే దేశంలో అభివృద్ధి జరిగినట్లు అని అన్నారు. ఎంత పెద్ద శాస్త్రవేత్త ఏ విషయం చెప్పినా రుజువు ఉంటేనే సైన్స్ ఒప్పుకుంటుందన్నారు. సైన్స్‌కు పెద్దా చిన్నా అనే తేడా ఉండదన్నారు.రాజ్యాంగంలోని 51 ఏ(హెచ్) ప్రకారం ప్రతి పౌరుడిలోనూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. మనుషులకు నష్టం కలిగించే ఏ నమ్మకాన్ని అయినా ప్రశ్నించకపోతే మానవజాతి మనుగడకు పెద్ద ముప్పు వాటిల్లుతుందన్నారు. మదనపల్లిలో ఇద్దరు అమ్మాయిలను తల్లిదండ్రులే కొట్టి చంపుకునే స్థితికి నమ్మకాలు చేరుకోవడం బాధాకరమన్నారు.అదేవిధంగా ఢిల్లీ లో 11 మంది ఆత్మహత్య చేసుకోవడం కూడా మూఢ నమ్మకాలకు పరాకాష్ట అన్నారు. గ్లోబల్ జెన్ స్కూల్ కరెస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో మంచి వ్యవస్థలన్నీ కుప్పకూలి పోతూ కొత్త మూఢనమ్మకాలు ముందుకు వస్తున్నాయన్నారు. పర్యావరణం పెద్ద సమస్య గా ముందుకొచ్చిందన్నారు. విద్యా వ్యవస్థలో సృజనాత్మకతకు స్థానం లేకపోగా ర్యాంకులకు ప్రాధాన్యం పెరిగి పిల్లలను పరిశోధనల వైపు ప్రోత్సహించడం సన్నగిల్లిందన్నారు. ఈ మార్పులను అవగాహన చేసుకుని జేవీవీ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకుని వాళ్లకు లాభాలు తెచ్చిపెట్టే వనరుగా మారిపోయిందన్నారు. దీన్ని ప్రజల్లో చర్చకు పెట్టాల్సిన బాధ్యత జెవివి కార్యకర్తలుగా మనందరిపైనా ఉందన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ ప్రశ్నే సైన్సు అభివృద్ధికి మూలం అని, ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలని కోరారు. ఒకే సారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపగలిగేంత స్థాయిలో మనదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందినప్పటికీ చేతబడి, బాణామతి చేస్తున్నారని అమాయకులను చంపేస్తున్నారంటే వాటికి కారణం మూఢనమ్మకాలేనని అన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు నరసా రెడ్డి మాట్లాడుతూ దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం, కరువు కాటకాలు పోయి దేశ ప్రజల్లో గుణాత్మక మార్పు రావాలంటే ఒక్క సైన్సు అభివృద్ధితోనే సాధ్యం అన్నారు. అనంతరం జరిగిన చెకుముకి జిల్లాస్థాయి పోటీల్లో ప్రైవేట్ పాఠశాలల నుంచి గ్లోబల్ జెన్ విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల నుంచి ముదిరెడ్డి పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి ఎం కె నబీ, ఎన్. మహేంద్ర రెడ్డి, మండల విద్యాధికారి రాఘవయ్య, గుట్టూరు ప్రధానోపాధ్యాయుడు నాగార్జున యు టి ఫ్ నాయకులు నారాయణ స్వామి, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్, జెవివి నాయకులు రమేష్ , రవీంద్ర , కేశప్ప, ఓబులేసు,రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కొడికొండ పాత చెరువుకు గండి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కొడికొండ సమీపంలోని పాతచెరువుకు గండి పడింది. దీంతో చెరువులోని నీరంతా చెరువు క్రింద ఉన్న పొలాల్లోకి వెళుతోంది. పంటలు వేసుకున్న రైతులు ఆందోళన చెంది గండి పూడ్చడానికి ప్రయత్నించారు. అయితే సాధ్యం కాకపోవడంతో ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇరిగేషన్ ఏఈ గౌతమ్ నారాయణ అక్కడికి చేరుకొని తూము వద్ద నీరు వెళుతున్నట్టు గుర్తించి పూడ్చివేయించారు. దీంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

పొలాల్లోకి చేరిన నీరు

రోడ్లపై మురుగు

ప్రజాశక్తి - కొత్తచెరువు

పట్టణంలోని వేణుగోపాల్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోందని దీంతో కాలనీ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం కాలనీ ప్రజలతో సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ముత్యాలు మాట్లాడుతూ బీసీ హాస్టల్ వరకు సిసి రోడ్డు డ్రైనేజీ వేశారని మిగతా వాటిని అర్ధాంతంగా ఆపివేయడంతో మురుగునీరు ఇళ్ల మధ్యలోనే నిల్వ ఉంటోందని అన్నారు. దీంతో కాలనీలో నివసించే ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే అక్కడ రోడ్డున నిర్మించి డ్రయినేజీనీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శంకర్ రెడ్డి, శ్రావణి,కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు అనుకూలంగా మార్కెట్ యార్డులు

మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నరసింహమూర్తి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రైతులు పండించిన తమ ఉత్పత్తులను సమీప మార్కెట్ యార్డులలో దళారుల బెడద లేకుండా విక్రయించుకునేందుకు జిల్లాలో మార్కెట్ యార్డులు అందుబాటులో ఉన్నాయని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నరసింహమూర్తి చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతుంటారు. సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం పంట ఉత్పత్తులను దాచుకునే సదుపాయం లేకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసి పలు సదుపాయాలను అందిస్తోందని శ్రీసత్యసాయి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఎం.ఎల్. నరసింహ మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న:- జిల్లాలో ఎన్ని మార్కెట్ యార్డులు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఇందులో శీతల గిడ్డంగులు ఉన్నాయా?

ఎడి: జిల్లాలో 8 మార్కెట్ యార్డులు ఉన్నాయి. ధర్మవరం, గోరంట్ల, హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, తనకల్లులో ఉన్నాయి. ఇందులో శీతల గిడ్డంగులు ప్రభుత్వపరంగా లేవు. ఎవరైనా ప్రయివేటు వ్యక్తులు శీతల గిడ్డంగులు ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి భూమి సదుపాయం కల్పిస్తాం. ఆ గిడ్డంగులలో నిలువచేసే సరుకులకు వారు సుంకం వసూలు చేసుకోవచ్చు. హిందూపురంలో ఆ విధంగా ముందుకు వచ్చి శీతల గిడ్డంగులు కొందరు నిర్మించుకున్నారు.

ప్ర: జిల్లాల్లో మార్కెట్ యార్డుల నిర్వహణ ఏమిటి.?

ఎడి: జిల్లాలో ధాన్యం నిలువ చేసుకునే గిడ్డంగులు అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ ఉన్నాయి. ఆ గిడ్డంగులలో నామమాత్రపు ఫీజు చెల్లించి ఎన్ని రోజులైనా పంటను నిలువ చేసుకునే అవకాశం ఉంది. పెద్ద మార్కెట్లు కలిగిన పట్టణాల్లో ఉండే మార్కెట్ యార్డుల్లో రోజువారి లేదా వారానికి ఒకసారి రైతులు తమ ఉత్పత్తులను వేలం ద్వారా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. వ్యాపారులు వేలం పాటలలో పాల్గొంటారు. దీనివల్ల రైతులు దళారుల బారిన పడకుండా తమ ఉత్పత్తులను విక్రయించుకునే వెసులుబాటు ఉంది.

ప్ర: మార్కెట్ యార్డులలో ఎయే సరుకులు విక్రయాలు ఉంటాయి? ఎన్ని గిడ్డంగులు ఉన్నాయి?

ఎడి: ప్రధానంగా వ్యాపార కూడలి అయిన హిందూపురంలో చింతపండు, వట్టి మిరప, తదితర సరుకులు క్రయవిక్రయాలు ఉంటాయి. ఇవి గాక రోజువారి వస్తువుల వ్యాపారాలు జరుగుతుంటాయి. గోరంట్ల, కదిరి, కొత్తచెరువు యార్డులలో పశువుల వారపు సంతలు జరుగుతాయి. అందులో పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ధర్మవరంలో మామిడికాయల సీజన్లో ఎక్కువగా ఆ కాయల విక్రయాలు జరుగుతుంటాయి. ఈ యార్డుల్లో 30 వరకు గిడ్డంగులు ఉన్నాయి. ఇవి గాక ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కూడా గిడ్డంగులు ఉన్నాయి.

ప్ర: మార్కెట్ యార్డుల వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయి? చెక్ పోస్టుల పని విధానం ఏమిటి?

ఎడి: మార్కెట్ యార్డులలో రైతులు తమ పంటల ఉత్పత్తులను నామమాత్రపు ఫీజులతో నిలువ చేసుకోవచ్చు. దళారుల బెడద లేకుండా స్వేచ్ఛగా తమకు నచ్చిన ధరకు సరుకు విక్రయించుకోవచ్చు. జిల్లాలో 12 చెక్ పోస్టులు ఉన్నాయి. బత్తలపల్లి, రాళ్లఅనంతపురం, గుమ్మయ్యగారిపల్లి, పాలసముద్రం, కొడికొండ, మేళాపురం, కుటాగుల్ల, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, మహమ్మదాబాద్ క్రాస్, కొక్కంటి క్రాస్ ప్రాంతాలలో చెకో పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా చట్ట వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాలకు వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే వాహనాలను ఈ చెకపోస్టులలో తనిఖీ నిర్వహించి, అక్రమంగా

తరలిస్తుంటే తగిన చర్యలు తీసుకుంటాం. రైతు వారి ఉత్పత్తులకు సంబంధించి సరైన పత్రాలు చూపించి ఎక్కడైనా విక్రయించుకునే సదుపాయం ఉంది. తన ఉత్పత్తులకు సంబంధించి పాస్ పుస్తకం, వన్ బి తదితర పత్రాలను చెక్కు పోస్టులల్లో అధికారులకు చూపించాల్సి ఉంటుంది.

ప్ర : ఏటా మార్కెట్ యార్డుల ద్వారా ఎంత మొత్తం ఆదాయం ఉంటుంది? అన్నింటికి భవన సముదాయాలు ఉన్నాయా.?

ఎడి: జిల్లాలోని 8 మార్కెట్ యార్డుల ద్వారా సుమారు రూ.5కోట్లు ప్రభుత్వానికి పన్నుల రూపంలో వస్తోంది. చెకోపోస్టుల్లో తనిఖీల ద్వారా వచ్చిన డబ్బును మరుసటి రోజే చలానా ద్వారా సిబ్బంది చెల్లించాల్సి ఉంటుంది. కొత్తచెరువు, గోరంట్ల యార్డుల్లో అధికారుల కార్యాలయాల భవనాలు చిన్నగా ఉన్నాయి. వాటిని పెద్దగా నిర్మించాల్సి ఉంది. చాలా యార్డుల్లో సిసి రహదారులు, డ్రైయినేజీ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. వీటిపై ప్రభుత్వానికి నివేదికలు ప్రతిపాదించాం.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా? రైతులకు మీరు ఇచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

ఎడి: మార్కెట్ యార్డులలో దాదాపు 50 శాతం సిబ్బంది అవసరం అవుతుంది. ఉన్న వారితోనే కొనసాగిస్తున్నాం. ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు ప్రతిపాదించాం. రైతులు తమ ఉత్పత్తులను దళారుల బారిన పడకుండా మార్కెట్ యార్డుల ద్వారా గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవచ్చు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి సన్మానం

ప్రజాశక్తి - గుడిబండ

మండలానికి చెందిన వీరజ్జనపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకులు ఆనందకృష్ణను దాసరి సంఘం డైరెక్టర్‌గా పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈమేరకు ఆయన మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిని, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిని, కలిసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, మైనార్టీ సెల్ అధ్యక్షులు షబ్బీర్‌తో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని మల్లేపల్లి పంచాయతీ (సచివాలయం) పరిధిలో వున్న గ్రామాల రైతులకు సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేశారు. రబీ సాగుకోసం ప్రత్యామ్నాయ విత్తనాలైన ఉలవలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు రాఘవ, రవి, ఆటో రవి, డీలర్ రవి, రాజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులుగా నజీర్ అహ్మద్

ప్రజాశక్తి - గుడిబండ

టిడిపి నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా రాళ్లపల్లికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు, మాజీ ఎంపీటీసీ నజీర్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నజీర్ అహ్మద్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తనకు ఈ పదవి రావటానికి కారణమైన వారందరికీ కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని సుబ్బిరెడ్డిపల్లిలో సప్తగిరి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మంజునాథ్, కళాశాల ఏఓ బి.గంగిరెడ్డి మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల బెడద తగ్గుతుందని తెలిపారు. తద్వారా వ్యాధులు నుండి రక్షించుకోవచ్చని తెలియజేశారు. ఇందులో భాగంగా వాలంటీర్లు దేవాలయం పరిసరాలను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు. అదే విధంగా పాఠశాల ఆవరణ కూడా శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ పోగ్రాం ఆఫీసర్లు జి.ప్రకాష్, నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మడకశిర టౌన్ :మండల పరిధిలోని మెళవాయి గ్రామంలో ఎస్ వై టి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో మత్తు వద్దు జీవితం ముద్దు అనే అంశంపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ హేమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ క్రిష్టప్ప, మురళి, రగామ సర్పంచి రంగరాథ్, గ్రామస్తులు శివ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా చెన్నప్ప

ప్రజాశక్తి - అమరాపురం

టిడిపి మడకశిర నియోజకవర్గ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులుగా మండలానికి చెందిన చెన్నప్పను అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా చెన్నప్ప మాట్లాడుతూ తనకు ఈ పదవి రావటానికి కారణమైన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు, టిడిపి ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామికి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తికి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన ఈసందర్భంగా చెప్పారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-హిందూపురం

రైతన్న మీకోసం' అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి రైతుల ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ తెలిపారు. ఈ రైతుల సర్వే డిసెంబర్ 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. వారం రోజుల పాటూ ప్రతి రైతు సేవా కేంద్రంలో గ్రామాలలో ప్రతిరోజూ రైతుల ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుంది.

సోమందేపల్లి :ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 24వ తేదీ సోమవారం నుండి డిసెంబర్ మూడవ తేదీ వరకు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలోనూ రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిని విజయభారతి తెలిపారు. ఇందులో ప్రస్తుతం రైతులు వేసిన పంటలను ఇంటింటా సర్వే నిర్వహించి ఎవరైనా పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ అర్హులుగా ఉండి అన్యాయం జరిగితే రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులు తమ వినుతులు తెలియజేయాలని కోరారు. మండలంలోని రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన భవనంలోకి జతిన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డు ఉన్న జతిన్ అసుపత్రి ఆదివారం నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా వైద్యులు వెంకట రమణ నాయక్ మాట్లాడుతు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గురునాథ్ థియేటర్ సమీపంలో లక్ష్మి విలాస్ పక్కన నూతన భవనంలో జతీన్ మల్టీ స్పెషాలిటీ అసుపత్రిని ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు కొండురు వేణుగోపాల్ రెడ్డితో పాటు ఇతర ప్రముఖులు వైద్యులు వెంకట రమణ నాయక్ ను కలిసి శుభకాంక్షలు తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
పిపిపికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలకు పిలుపు

సమావేశంలో ఐక్యత చాటుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన మెడికల్ కళాశాలల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాలలో నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనవాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెవివి కార్యదర్శి డాక్టర్ ఈ టీ రామ్మూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ఆర్‌సిపి కార్యదర్శి శ్రీనివాసులు ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతు పెనుకొండలోని వైద్య కళాశాలకు గత ప్రభుత్వం రూ.30 కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఇప్పుడు ప్రయివేటుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలే ప్రజలను ఆదుకున్నాయని గుర్తు చేశారు. సంపద సృష్టిస్తాననే నినాదంతో ముందుకొచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రభుత్వ, ప్రజల సంపదను ప్రైవేటీకరణ చేస్తోందనివిమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి మాట్లాడుతు ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన కళాశాలలను ప్రయివేటు పరం చేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీల భవనాల నిర్మాణాలను కొంతవరకు పూర్తి చేసిందని, వాటిని చూపకుండా ఖాళీ స్థలాలను చూపిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఐదు వేల కోట్లు ఒకేసారి గానీ, లేదా రాష్ట్ర బడ్జెట్‌లో ఏడాదికి రూ.600 కోట్లు కేటాయిస్తే ఐదేళ్లలో ఈ భవనాలు పూర్తవుతాయని అన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వ అధీనంలో ఉంటేనే మానవ అభివృద్ధి సాధ్యమన్నారు. డాక్టర్ ఈటీ రామ్మూర్తి మాట్లాడుతు కూటమి ప్రభుత్వం పీపీపీ పద్దతి ద్వారా వైద్య విద్యని పూర్తిగా ప్రైవేట్ శక్తులకు ఇవ్వాలన్న నిర్ణయం మంచిది కాదన్నారు. 500కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసి, వెనుక బడిన ప్రాంతం, కొత్త జిల్లా, పెనుకొండలో సత్వరం మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభించాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా క్లిష్ట సమయాల్లో ఆదుకున్నది ప్రభుత్వ వైద్యమే అని గుర్తు చేశారు. ఆర్‌సిపి కార్యదర్శి శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి ఇతర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతు వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలో ఉంటే సేవాదృకృథం ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రిగా 15 ఏళ్లుగా ఉన్న చంద్రబాబు నాయుడు ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ తీసుకురాలేదనిఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేట్ చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పిపిపి విధానాన్ని విరమించి 10 వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు అవసరమైన ఉద్యమాలను చేపట్టాలని రౌంట్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, వైద్యాన్ని కొనసాగించాలంటూ సభ అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో జెవివి నాయకులు రామకృష్ణ, ఆర్ ఎస్ పి నాయకులు మారుతీ ప్రసాద్, యూటీఎఫ్ నాయకులు మూర్తి, మున్సిపల్ యూనియన్ నాయకులు మల్లయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్, సిఐటియు నందీశ్వర, జెవివి నాగిరెడ్డి, ఎఐటియూసి అశోక్ తో పాటు ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

15న డప్పు కళాకారుల జిల్లా మహాసభలు

పోస్టరును విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - లేపాక్షి

డిసెంబర్ 15న పుట్టపర్తిలో డప్పు కళాకారుల జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఆదివారం కెవిపిఎస్ అనుబంధం డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ నేటికీ మండలంలో అన్ని గ్రామాల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. ఈ వివక్ష రూపుమాపేందుకు ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపటం లేదని విమర్శించారు. 105 జీవో అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జీవోను అమలు చేసి పౌరహక్కుల దినం పాటించే విధంగా ప్రజలకు చట్టాల గురించి వివరించి అంటరానితనాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 15వ తేదీ పుట్టపర్తి లో జరిగే డప్పు కళాకారుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా మంజునాథ్, ఉపాధ్యక్షులుగా నరసింహులు, సహాయ కార్యదర్శిగా నరసింహులుతో పాటు మరో 50 మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జ్యోతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :డిసెంబర్ 15వ తేదీన నిర్వహిస్తున్న డప్పు కళాకారుల సంఘం మహాసభలను జయప్రదం చేయాలని సంబంధిత ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం అందుకు సంబంధించిన కరపత్రాలను అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, జిల్లా కార్యదర్శి రమణ, జిల్లా కమిటీ సభ్యులు మారుతి మాట్లాడుతూ మహాసభల్లో జిల్లాలోని డప్పు కళాకారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామాంజప్ప, మల్లయ్య, గంగమ్మ, చంద్రమ్మ, సరస్వతి, లక్ష్మీదేవి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు పరిగి విద్యార్థులు

ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ధనాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు అండర్ 14 విభాగంలో ప్రతిభ కనపర్చి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు తెలిపారు. 8 తరగతి చెందిన చరణ్ అనంతపురం జూనియర్ కళాశాలలో జరిగిన అండర్ 14 వాలీబాల్ పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. డిసెంబర్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు వారు వెల్లడించారు. వీరికి పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు వ్యక్తం చేశారు. అదే విధంగా అండర్ - 14 అండర్ - 17 బాల బాలికల కోసం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో పరిగి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి అనంతపురం జిల్లా తరుపున రాష్ట్ర స్థాయి కి ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజ్, వ్యాయామ ఉపాధ్యాయుడు వినోద్ తెలిపారు.వీరిలో ఫుట్‌బాల్‌లో హర్షవల్లి, హ్యాండ్‌బాల్‌లో మంజుల, రగ్బీలో సిరిమల్లిక, ఫుట్‌బాల్‌లో గంగమ్మ, రగ్బీలో స్వాతి, హ్యాండ్‌బాల్‌లో కళ్యాణ్, రగ్బీలో వర్షిత, నవరత్న, లలిత్ కిషోర్ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి కి ఎంపికయ్యారన్నారు. అలాగే సబ్ జూనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయికి హర్షవల్లి ,మంజుల,. నవరత్న, రాజు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల చైర్మన్ పాఠశాల సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

చిల్డ్రన్ పార్క్,బస్ షెల్టర్ ప్రారంభం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల సందర్భంగా అభివృద్ధి పనుల్లో భాగంగా చిల్డ్రన్స్ పార్కు, బస్సు షెల్టర్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర ఆదివారం ప్రారంభించారు. పుట్టపర్తి లోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో బస్సు షెల్టర్ ను తమ సొంత నిధులతో ఏర్పాటుచేసి ఎమ్మెల్యే అత్త పేరైన పల్లె ఉమా బస్సు షెల్టర్‌గా నామకరణం చేశారు. పుట్టపర్తి నుండి కదిరి, నల్లమాడ, కొత్తచెరువు, బుక్కపట్నం వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే వారిని వారి సౌకర్యార్థం ఈ బస్సు షెల్టర్ ను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పార్కును మున్సిపాలిటీ నిధులను రక్షించి నిర్మించినట్లు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

బస్‌షెల్టర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని వలిసాబ్ రోడ్డు 29వ వార్డులో అబ్దుల్ కలాం స్ట్రీట్ రోడ్డు సమస్యకు పరిష్కారం లభించింది. దాదాపు 15 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్డు పనులు పూర్తికావడంతో స్థానికులలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆవేదనను గమనించిన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ నిర్ణయానికి ప్రజల్లో విశేష స్పందన లభించింది. రోడ్డు సమస్య పరిష్కారంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కీలక పాత్ర పోషించారు. పట్టణ టిడిపి అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పలుసార్లు చర్చలు జరిపారు. డైమండ్ ఇర్ఫాన్ ఈ సమస్య పరిష్కారానికి నిరంతర శ్రద్ధ పెట్టి ఎమ్మెల్యే కందికుంట మార్గదర్శకంలో అధికారులతో నేరుగా సమావేశమై పనులు ప్రారంభం అయ్యేలా కృషి చేశారు. దీర్ఘకాలంగా రోడ్డు లేని కారణంగా వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరడం, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం ప్రజలకు ఊరట కలిగించింది. రోడ్డు పూర్తికావడంతో ఈ ప్రాంతంలో విద్య, వాణిజ్యం, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాసీం, పిచ్చిలి శంకర్, కైఫ్, ప్రధాన కార్యదర్శి అజిముల్లా అర్బాజ్ , రియా గ్రాఫిక్స్ ఇమ్రాన్ తదితరులు రహదారి పనుల్లో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం మెడలు వంచుదాం : వైసిపి

సమావేశంలో మాట్లాడుతున్న దీపికా వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించే వరకు వైసిపి పోరాటాలు సాగిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హిందూపురం పట్టణంలోని 32వ వార్డు అహ్మద్ నగర్ లో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాలతో కూటమి మెడలు వంచుదామని తెలిపారు. అనంతరం వార్డులలో కమిటీలను ఏర్పాటు చేసి, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ఇన్చార్జ్ హుమయున్, టౌన్ కన్వీనర్ మన్సూర్, కౌన్సిలర్ ఆసిఫ్, రాష్ట్ర మైనార్టీ సెల్ సహాయ కార్యదర్శి ఫరూక్, నియోజకవర్గ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ జల ప్లాంట్ల ఏర్పాటుకు రూ.30 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు ప్రాంతాల్లో శుద్ధ జల ప్లాంట్ల ఏర్పాటుకు శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ రూ.30 లక్షలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ప్రజలందరికీ శుద్ధ జలాలు అందించాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే ఏపీ టెక్నాలజీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ మేరకు సంబంధిత సంస్థ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ అసిస్ట్ ఎన్జీవో సంస్థ ప్రతినిధికి చెక్కును అందజేశారు. అసిస్టు సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని ఆరు ప్రాంతాల్లో శుద్ధ జల ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. హిందూపురం పట్టణంలోని మోతుకపల్లి, ముద్దిరెడ్డిపల్లి, చౌడేశ్వరి కాలనీ, పట్టణంలోని రహమత్ పురంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో, చిలమత్తూరు మండల పరిధిలోని మదిరేపల్లి, హిందూపురం రూరల్ మండల పరిధిలోని అప్పులకుంట శుద్ధ జల ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని గ్లోబల్ హండర్డ్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఫుడ్ ఫెస్టివల్ జరిగింది. ప్రధానోపాధ్యాయులు మౌలానా ఇస్మాయిల్ ఆధ్వర్యంలో జమాత్ ఏ అహలే హదీస్ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఉస్మాన్ ఘనీ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభించారు. వందలాది మంది విద్యార్థులు శాఖాహార, మాంసాహార, దేశ విదేశీ రుచికరమైన వంటలను తయారు చేసి ప్రదర్శించారు. ఆయా వంటకాల ప్రాముఖ్యత, లాభాలు ఆరోగ్య ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్, రామచంద్ర నాయక్, మౌలానా ఇర్ఫాన్ హాఫీజ్ అలీ, మెడికల్ రూహెల్, అల్ అమీన్ రియాజ్, ముతవల్లీ ఫయాజ్, డాక్టర్ ఉజేర్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శశి కుమార్ తెలిపారు. మతుడి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. మక్కాజి పల్లి నుండి నాగసముద్రం వైపు వెళ్లే రైలు పట్టాలపై తలపై ఎడమవైపు దెబ్బ తగిలి ట్రాక్ మధ్యలో పడి ఉన్నట్లు తెలిపారు. రైల్వే కీ మాన్ గమనించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి షర్టు జేబులో రెడ్డిపల్లి గ్రామం, రొద్దం మండలం కె. వెంకటేష్, లక్ష్మన్న, ఆనందమ్మ అని పేర్లు రాసి ఉన్న కాగితం లభ్యమైనట్లు తెలిపారు. మృతుడిని గుర్తించగలిగిన వ్యక్తులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పార్కింగ్ విషయంలో గొడవ.. పలువురిపై కేసు

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్ వద్ద కారు పార్కింగ్ విషయంలో పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. అందుకు సంబందించిన వివరాలు... పట్టణంలోని అమీర్ నగర్ చెందిన బి. ధనుంజయ హిందూపురంలోని డివిజన్ పోస్టల్ ఆఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. ధనుంజయ తండ్రి సంవత్సరీకానికి అతని బంధువులు సప్తగిరి హోటల్ వద్ద ఉండగా కారులో వెళ్లిన ధనుజంయ కారులో అక్కడికి వెళ్లి రోడ్డుపక్కన పార్కు చేశారు. దీంతో సప్తగిరి హోటల్ సిబ్బంది అక్కడికి వచ్చి కారును పక్కకు తీయాలని చెప్పారు. ఈ విషయంపై హోటల్ సిబ్బందికి, ధనుంజయకు మాటామాట పెరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో హోటల్ సిబ్బంది రెడ్డి నరసింహ,మురళి, బాదుల్లా, శేషగిరి స్వామి, లాయర్ శివ మరి కొందరు కలసి తనమీద, తన బంధువుల మీద దాడికి పాల్పడ్డారని ధనుంజయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్.రాయాపురంలో వరుస చోరీలు

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని ఎస్. రాయాపురం గ్రామంలో ఇటీవల చోరీలు పెరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిముందు ఉన్న కోళ్లు మేకలను దొంగలించుకుని వెళ్తున్నట్లు బాధితులు మహాలింగప్ప, ఈరన్న, భాగ్యమ్మ తదితరులు వాపోతున్నారు. శనివారం రాత్రి భాగ్యమ్మ ఇంటి వద్ద ఉన్న మూడు కోళ్లను తీసుకెళ్లినట్లు తెలిపారు. అదే విధంగా ఈరన్నకు చెందిన మూడు కోళ్లు మహ లింగప్పకు చెందిన మేకను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గ్రామంలో రోజురోజుకు దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇలాంటి దొంగతనాలు తరచూ జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రాత్రివేళల్లో గస్తీలు చేపట్టి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కలదాడిలో జింకపిల్లకు గాయం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు పరిసరాల్లో జింకపిల్ల తప్పిపోయి జనావాసాల్లోకి వచ్చింది. కుక్కలు దానిని వెంబడించి గాయపరిచాయి. స్థానికులు గుర్తించి జింకపిల్లను స్వాదీనం చేసుకొని ఫారెస్ట్ అధికారులకు అప్పజెప్పారు. ప్రాథమిక చికిత్స చేసి ఆహారం అందించి అడవిలో వదిలేసినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కేశప్ప తెలిపారు.

జింకపిల్ల అప్పగింత

జిల్లా వ్యాప్తంగా సత్యసాయి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల వ్యాప్తంగా సత్యసాయి బాబా 100 జన్మదిన వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కొత్తచెరువులోని నాలుగు రోడ్ల కూడలిలో భజన మందిరం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఈ వేడుకలను నిర్వహించారు. అలాగే పెనుగొండ రోడ్డులో చిన్నారప్ప కుటుంబ సభ్యులు, నాలుగు రోడ్ల కూడలిలో రవి నాగేంద్ర కుటుంబ సభ్యులు, పుట్టపర్తి రోడ్ లో టీచర్ పెద్దన్న, ఫోటో స్టూడియో ముందర, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పుట్టపర్తికి సత్యసాయిబాబా వేడుకలకు వెళ్లేవారు ఇక్కడ భోజనం చేసుకుని వెళ్లారు.

ముదిగుబ్బ : సత్యసాయిబాబా 100వ జన్మదిన వేడుకలను ముదిగుబ్బ మండల వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. మలకలవేముల, ముదిగుబ్బ, దొరిగల్లు, మల్లేపల్లి, మార్తాడు, కొడవడ్లపల్లి, సంకెపల్లి, గండ్లవారిపల్లి, యనుములవారిపల్లి, యస్. బ్రాహ్మణపల్లి గ్రామాల్లో సత్యసాయి వాటర్ పంప్ హౌస్ దగ్గర సత్య సాయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికులు పాల్గొన్నారు.

నల్లమాడ : నల్లమాడ మండలంలో సత్యసాయి బాబా 100 వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, గోపాలయ్య, లక్ష్మీనారాయణ గుప్త, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పట్టణంలోని పాండురంగనగర్ సత్య సాయి నిలయంలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, సత్య సాయి బాబా భక్తులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : శ్రీసత్యసాయి బాబా ట్రస్టు ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు ఆమోఘమని పలువురుకొనియాడారు. శ్రీ సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని మండలంలోని సత్యసాయి వాటర్ ట్యాంకుల వద్ద బాబా చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని 40-గ్రామాలలో సత్యసాయి మంచినీటి కొళాయిల వద్ద మహిళలు పూజలు చేశారు. మాల్యవంతంలోనిసత్యసాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బత్తలపల్లిలోని వీధులలో కార్మికులు ఆధ్వర్యంలో బాజా చిత్రపటాన్ని ఊరేగించారు. బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ప్రయాణీకులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో మండలంలోని సూపర్వైజర్లు, కార్మికులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతి వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకలకు విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పుట్టపర్తి బిజెపి నాయకులు విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి ప్రసాద్ తదితరులు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు.

కేంద్రమంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే : శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి విచ్చేసిన కేంద్ర సమాచార, ప్రసార పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి లోకనాథన్ మురుగన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా బిజెపి నాయకులు లాయర్ హరికృష్ణ, జ్యోతి ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. ప్రశాంతి నిలయంలోని సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకున్న కేంద్రమంత్రి పుట్టపర్తిలో పలు కార్యక్రమాలు పాల్గొన్నారు.

కొత్తచెరువు: సత్య సాయి బాబా వేడుకలకు హాజరవడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టపర్తి విమానాశ్రయంలో దిగారు. ఈయనకి రాష్ట్ర మంత్రులు అనగాని సత్య ప్రసాద్, కందుల దుర్గేష్, సవితమ్మ, ఎంపీలు డీకే పార్థసారథి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు బొకేలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. బాబా చిత్రపటాన్ని బహుకరించి సన్మానించారు. అనంతరం ఆయన సత్యసాయి సమాధి దర్శించుకొని హిల్ వ్యూ స్టేడియంలో బాబా శత జయంతి వేడుకల్లో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.